క్లుప్తంగా

ఏపీజీవీబీ మేనేజర్‌గా మహేశ్వర్రావు

రోలుగుంట: స్థానిక ఏపీజీవీబీ మేనేజర్‌గా పి.మహేశ్వర్రావు నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఈయన బొబ్బిలి బ్యాంకులో మేనేజర్‌గా పని చేసి ఇక్కడకు బదిలీపై వచ్చి శుక్రవారం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బందితో కలసి ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు. ఖాతాదారులు తమ సేవలు సద్వినియోగం చేసుకుని బ్యాంకు అభివృద్ధికి తోడ్పాటునందించాలని కోరారు. ఇక్కడ మేనేజర్‌గా పని చేసిన నందిని సాహూ రెండు మాసాల క్రితమే బదిలీ అయ్యారు.

నారుమడుల్లో నీరు నిల్వ ఉంచొద్దు

మాకవరపాలెం: నారుమడుల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని ఏవో చిరంజీవి రైతులకు సూచించారు. అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలతో వ్యవసాయ భూముల్లో అధికంగా నీరు చేరింది. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం విత్తనాలు చల్లుకున్న నారుమడుల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని తెలిపారు. అలా చేయకుంటే విత్తనాలు మొలకెత్తవన్నారు. ఈ విషయంలో రైతులు తమ సూచనలు పాటించాలన్నారు.

రోలుగుంట: ఆకుమడుల్లో నీటి నిల్వలు లేకుండా సంరక్షించుకోవాలని ఏవో ఎస్.విజయలక్ష్మి రైతులకు సూచించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను ప్రభావంతో మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఆకుమడులు, వెద వరి పంటకు నష్టం వాటిల్లకుండా మడుల్లో వర్షపు నీరు లేకుండా బయటకు పోయే మార్గం చేసుకోవాలని సూచించారు.

పోటీతత్వంతో ఉత్తమ ఫలితాలు



విద్యా సామగ్రిని అందిస్తున్న వార్డు మెంబర్ గోవిందరావు

కె.కోటపాడు: విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకుంటేనే చదువులో మంచి మార్కులు సాధిస్తారని వైఎస్సార్‌సీపీ నాయకుడు, వార్డు మెంబర్ వంటాకు గోవిందరావు తెలిపారు. మల్లంపాలెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం ఆయన విద్యా సామగ్రిని తన సొంత నగదుతో కొనుగోలు చేసి పంపిణీ చేశారు. చదువుల్లో విద్యార్థులను ప్రోత్సహించేందుకు వీటిని అందించానన్నారు. మంచి చదువుతోనే ఉన్నత ఉద్యోగ అవకాశాలను అందుకోవచ్చునని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని శాంతి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మారేపల్లిలో గిరి ప్రదక్షిణ నేడు



శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం

దేవరాపల్లి: మారేపల్లిలో ఉత్తర వాహిని శారదానది తీరాన వెలసిన శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి గిరి ప్రదక్షిణను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వాక ముత్యాలమ్మ తల్లి జంక్షన్, వెంకటరాజుపురం, తెనుగుపూడి, భీమలింగేశ్వర స్వామి ఆలయం, మారేపల్లి బీసీ కాలనీ మీదుగా పాండవుల మెట్ట స్వామివారి ఆలయం వద్దకు గిరి ప్రదక్షిణ చేరుకుంటుందన్నారు. ఏడు కిలోమీటర్ల మేర గిరి ప్రదక్షిణ భక్తిశ్రద్ధలతో జరుగుతుందన్నారు. శనివారం సాయంత్రం 4 గంటల ప్రారంభమయ్యే గిరి ప్రదక్షిణలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బొజ్జన్నకొండ అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

అనకాపల్లి: శంకరం పంచాయతీలో ప్రముఖ పర్యాటక కేంద్రం బొజ్జన్నకొండ అభివృద్ధి పనులను కార్తీకమాసంలోగా పూర్తిచేయాలని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో రూ.15 కోట్లతో ప్రారంభించిన అభివృద్ధి పనుల్లో జాప్యం నెలకొందన్నారు. ప్రజాప్రతినిధులు, పురాతత్వశాఖ అధికారులు, కలెక్టర్ దృష్టి సారించి అభివృద్ధి పనుల్ని వేగవంతం చేయాల్సిందిగా కోరారు.



నర్సీపట్నం: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షం



రోలుగుంట: ఏపుగా ఎదిగి పచ్చగా ఉన్న నారుమడి



రోలుగుంట: జలకళతో ఊర చెరువు



దేవరాపల్లిలో భారీ వర్షం కురుస్తున్న దృశ్యం

ఎడతెరిపిలేని వర్షం

- స్తంభించిన జనజీవనం
- మూతపడ్డ పాఠశాలలు
- వరి నారుకు మేలు చేసిన వాన



కె.కోటపాడు: చౌడువాడలో కురుస్తున్న వర్షం

నర్సీపట్నం/మాకవరపాలెం: అల్పపీడనం ప్రభావంతో గురువారం రాత్రి నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో శుక్రవారం ఉదయం నుంచి జనజీవనం స్తంభించింది. ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అత్యవసర పనులపై వెళ్లేవారు తప్పితే మిగిలిన వారంతా ఇళ్లకే పరిమితం కావాల్సి వచ్చింది. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యా శాఖ పాఠశాలలకు ప్రకటించింది. దీంతో ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయి. కొన్ని ప్రైవేట్ పాఠశాలలు యథావిధిగా పని చేశాయి.

వర్షం కారణంగా ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. కురుస్తున్న వర్షాలు వ్యవసాయ పనులకు ఉపయోగపడతాయని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నర్సీపట్నం డివిజన్ మొత్తం మీద 328.2 మి.మీ వర్షపాతం నమోదయింది. నక్కపల్లి మండలంలో 44.4 అత్యధికంగా గొలుగొండ మండలంలో అత్యల్పంగా 12.2 వర్షపాతం నమోదైంది. నాతవరంలో 25.6 మి.మీ, నర్సీపట్నం 25.4 మి.మీ, రోలుగుంట 23.8 మి.మీ, రావికమతం 35.4 మి.మీ, మాడుగుల 25.4, మి.మీ, చీడికాడ 30.8 మి.మీ, కోటవురట్ల 30.2 మి.మీ, మాకవరపాలెం 27.8 మి.మీ, పాయకరావుపేట 20.6 మి.మీ, ఎస్.రాయవరం 26.6 మిల్లీమీటర్ల మేర వర్షం పడింది.

సర్పా పరీవాహక ప్రాంతం పరిశీలన..

వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాకవరపాలెం తహసీల్దార్ మురళీమోహనరావు సూచించారు. మండలంలోని తూటిపాల, తాడపాల గ్రామ సమీపంలో సర్పానదిని ఆయన శుక్రవారం పరిశీలించారు. కల్యాణపులోవ రిజర్వాయర్ నీరు విడుదల చేసినందున సర్పానదిలో నీటి ఉధృతి పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో పాడి రైతులు పశువులను నది ప్రాంతానికి తీసుకెళ్లొద్దన్నారు. ఇదే విషయమై ప్రజలకు టామ్‌టామ్ వేయించినట్లు తెలిపారు.

దేవరాపల్లిలో 2 సెంటీమీటర్ల వర్షపాతం

దేవరాపల్లి/కె.కోటపాడు/మాడుగుల రూరల్: తుఫాన్ ప్రభావంతో ఎడతెరిపి లేకుండా వర్షపు జల్లులు పడటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వెరసి దేవరాపల్లిలో రెండు సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. వర్షం కారణంగా ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. పాఠశాలలకు సెలవు ప్రకటించారు. లోతట్టు ప్రాంత భూముల్లో వర్షపు నీరు చేరింది. ఈ వర్షం వరినారు మడులతోపాటు ఖరీఫ్ దమ్ములకు ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. మాడుగుల **మండలం తాటిపర్తి వద్ద తారకరామ జలాశయంలో నీటి మట్టం స్వల్పంగా పెరిగింది. దీంతో పాటు చెరువుల్లో నీరు చేరింది. తాచేరు, పాలగెడ్డ, శారదా నది, చింతగెడ్డలో నీరు చేరింది. ఈ వర్షాలతో అన్ని గ్రామాల్లో వరినాట్లు ప్రారంభం కానున్నాయి.**

చెరువుల్లో జలకళ

బుచ్చెయ్యపేట/రోలుగుంట: ఏకధాటిగా వర్షం కురుస్తూనే ఉంది. రోజువారి కూలీలు వర్షంతో పనులు లేక ఇబ్బందులు పడ్డారు. వారం రోజుల క్రితం వరకు పల్లపు భూముల్లో ఆకుమడులు ఒక మాదిరిగా ఉన్నా, మెట్ట భూముల్లో ఎండిముఖం దశకు వచ్చాయి. ఈ తరుణంలో గురు, శుక్రవారాలు కురిసిన వర్షాలు ఊపిరిపోశాయి. చెరువుల్లో జలకళ సంతరించుకుంది. ఇదే వర్షం కొనసాగితే దమ్ములు చేసుకోవడానికి అనుకూలంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. శుక్రవారం ఉదయానికే బుచ్చెయ్యపేట మండలంలో 45 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదుకాగా రాత్రి వరకు 90 మిల్లీమీటర్లకు పైగా నమోదైంది. రోడ్లపై గోతుల్లో



బుచ్చెయ్యపేట రోడ్డులో కురుస్తున్న వర్షం

చేరిన వర్షం నీటితో వాహనదారులు రాకపోకలకు **తీవ్ర అవస్థలు** పడ్డారు.

ఈదురుగాలులతో వర్షం

చోడవరం: తుపాను వర్షాలతో జన జీవనం స్తంభించింది. ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తుండటంతో జనం ఇళ్లకే పరిమితమయ్యారు. చోడవరం పరిసరాల్లో మూడు రోజుల్లో 54 మిల్లీ మీటర్లు వర్షం కురవగా, శుక్రవారం 28 మిల్లీమీటర్ల కురిసింది. పొలాల్లో భారీగా వర్షపునీరు చేరింది. రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనచోదకులు చాలా ఇబ్బందులు పడ్డారు. మరో పక్క ఈదురుగాలులకు విద్యుత్ సరఫరాకు కొంతమేర అంతరాయం కలిగింది. ఈ వర్షాలు వరి నారుకు మేలు చేయగా, పల్లపు ప్రాంతాల్లో ఉడుపులు ప్రారంభించేందుకు ఎంతో ఉపయోగకరమని రైతులు చెబుతున్నారు.



బుచ్చెయ్యపేటలో వర్షంతో తేరుకున్న వరి ఆకుమడి



మాకవరపాలెం: తూటిపాలలో సర్పానదిని పరిశీలిస్తున్న తహసీల్దార్ మురళీమోహనరావు



మాడుగుల రూరల్: వర్షాలకు తారకరామ జలాశయంలో చేరిన నీరు



మాడుగుల రూరల్: వర్షాలకు తాటిపర్తిలో కళకళలాడుతున్న వరినారు మడి



చోడవరంలో కురుస్తున్న వర్షానికి రోడ్లపై నిలిచిపోయిన నీరు

1,015 కిలోల గడ్డి విత్తనాలు సిద్ధం



పశువైద్య కేంద్రంలో ఉంచిన గడ్డి విత్తనాలు



కె.కోటపాడులో గడ్డి విత్తనాలను దించుతున్న కూలీలు

కె.కోటపాడు: రైతులకు పశుసంవర్ధక శాఖ ద్వారా అందించేందుకు గడ్డి విత్తనాలు కె.కోటపాడు పశువైద్య కేంద్రానికి చేరుకున్నాయి. 75 శాతం రాయితీపై కాకిజొన్న, మొక్కజొన్న రకం గడ్డి విత్తనాలను అందించనున్నారు. 280 కిలోల కాకిజొన్న రకం, 735 కిలోల మొక్కజొన్న రకం గడ్డి విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. ఐదు కిలోల బ్యాగ్‌తో అందించనున్నట్లు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. కాకిజొన్న ధర రూ.460 కాగా, రాయితీపై రూ.115కు, మొక్కజొన్న ధర రూ.340 ఉండగా, రూ.85కు అందిస్తామన్నారు. కె.కోటపాడు, కొరువాడ, చౌడువాడ పశువైద్య కేంద్రాలతోపాటు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో పశువైద్య సహాయకులను సంప్రదించాలని సూచించారు. రైతులు భూమి పాస్ పుస్తకంతోపాటు ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్ అందించాలన్నారు.

వరినాట్లకు సన్నద్ధం

- పొంగి ప్రవహిస్తున్న గెడ్డలు



బొడ్డేరు నుంచి ప్రవహిస్తున్న వర్షం నీరు



దారమఠం జలపాతం నుంచి పరుగులు తీస్తున్న నీరు



నాట్లకు సిద్ధంగా వరినారు మడి

గొలుగొండ: రైతన్నలు వరినాట్లకు సిద్ధమవుతున్నారు. పుష్కలంగా వర్షాలు కురవడంతో ప్రధాన గెడ్డల నుంచి వర్షం నీరు పొంగి ప్రవహిస్తోంది. ఏటా నర్సీపట్నం డివిజన్‌లోనే గొలుగొండ మండలంలో వరినాట్లు ప్రారంభమవుతాయి. ఇక్కడ ముందుగా నాట్లు వేసిన తర్వాత ఇతర ప్రాంతాల్లో మొదలవుతాయి. దారగెడ్డ, బోరింగ్ గెడ్డలు, బొడ్డేరు గెడ్డల నుంచి వర్షం నీరు ప్రవహిస్తోంది.

నూరుశాతం నాట్లు

మండలంలో సాధారణ వరి సాగు విస్తీర్ణం 3,400 ఎకరాల్లో ఉంది. ఏటా నాట్లు ఇక్కడ నూరుశాతం వేస్తారు. ఈ నెలాఖరుకు అన్ని ప్రాంతాల్లో నాట్లు వేయడం కోసం రైతుల పనులు చేస్తున్నారు. విప్పలపాలెం ఆయకట్టు పరిధిలో బొడ్డేరు గెడ్డ ఉంది. దీని ఆయకట్టు 1,500 ఎకరాలు, దారగెడ్డ, బోరింగ్ గెడ్డల ఆధారంగా 1,900 ఎకరాల్లో వరి సాగు చేయనున్నారు.

రైతులకు ఎంతో మేలు

దారకొండపై నుంచి వచ్చే వర్షపు నీరు బొడ్డేరు, దారగెడ్డ, బోరింగ్ గెడ్డల ద్వారా ప్రవహిస్తోంది. ఈ నీటితో ముందుగా వరినాట్లు పూర్తి చేస్తుంటారు. ఇక్కడ నాట్లు పూర్తి చేయగా మిగులు నీరు తాండవ జలాశయానికి చేరుతోంది. డివిజన్‌లో ముందుగా నాట్లు వేయడంతో రైతులకు కూలీల కొరత ఉండదు.

గోతుల వద్ద హెచ్చరిక బోర్డులు



బంగారుమెట్ట కల్వర్టు వద్ద పడ్డ గొయ్యిలో రక్షణ ఏర్పాటు



పొట్టిదొరపాలెం గోతుల వద్ద ఏర్పాటు చేస్తున్న హెచ్చరిక బోర్డు

బుచ్చెయ్యపేట: భీమునిపట్నం– నర్సీపట్నం (బీఎన్) రోడ్డులో గోతుల వద్ద ప్రమాదాలు వాటిల్లకుండా పొట్టిదొరపాలేనికి చెందిన వీఎస్సార్ సేవా సంస్థ అధినేత వడ్డి సత్యారావు, సభ్యులు సన్యాసిరావు, హరి, తదితరులు రక్షణ చర్యలు తీసుకున్నారు. శుక్రవారం వర్షానికి గోతుల్లో నీరు చేరింది. దాంతో గోతులు కనిపించకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురై గాయాల పాలయ్యారు. ఈ మేరకు బంగారుమెట్ట, పొట్టిదొరపాలెం, శింగవరం తదితర గ్రామాల్లో గోతుల వద్ద కర్రలతో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించారు.

54 మంది వృద్ధులకు కంటి పరీక్షలు



కంటి పరీక్షలను నిర్వహిస్తున్న ఆప్తాలమిస్టు

కె.కోటపాడు: కంటి సమస్యలున్న వారికి మెరుగైన వైద్యం అందించడానికి ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు బిషప్ ఎస్.మోజేష్ తెలిపారు. హోలీ లీల్ క్రైస్ట్ చర్చ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో శుక్రవారం వి.సంతపాలెంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వి.సంతపాలెం, వారాడ, ఆనందపురం గ్రామాలకు చెందిన 54 మంది వృద్ధులు కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఉచితంగా మందులు తీసుకున్నారు. వీరికి విశాఖపట్నానికి చెందిన విజన్ కేర్ ఆప్తాలమిస్టు కంటి పరీక్షలు చేశారు. పాస్టర్లు సహాయ, సహకారాలు అందించారు.

23 నుంచి ప్రత్యేక ఆధార్ సేవలు

నాతవరం: మండలంలో ఈ నెల 23 నుంచి గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని ఎంపీడీవో జాగరపు రాంబాబు తెలిపారు. ఆయన శుక్రవారం తన కార్యాలయంలో సచివాలయాల సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు ఆధార్ కార్డుల్లో చేర్పులు, మార్పులు చేసుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. డి.యర్రవరం, ఎం.బి.పట్నం, మన్యపురట్ల, గన్నవరం, గునుపూడి గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కొత్తగా ఆధార్ కార్డులు పొందాలన్నా, కార్డుల్లో తప్పొప్పులను సరి చేసుకోవాలన్నా ఇది చక్కటి అవకాశమన్నారు. నిబంధనల ప్రకారం చేర్పులు మార్పులు చేయాలని సిబ్బందికి సూచించామన్నారు. ఎవ్వరూ ఇబ్బంది పెట్టకుండా నిర్ణీత గడువు లోపు ఈ ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు.

మాడుగుల రూరల్: మొబైల్ ఆధార్ కేంద్రాల



సూచనలు చేస్తున్న ఎంపీడీవో రాంబాబు

ద్వారా ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ సేవలందిస్తామని ఎంపీడీవో ఆర్. కాశీప్రసాదరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో కె.జె.పురం -1, కె.వల్లాపురం, వీరనారాయణం, లోవ పొన్నవోలు సచివాలయాలల్లో సేవలందిస్తారన్నారు. ఐదేళ్ల లోపు చిన్నారులు, 18 ఏళ్ల లోపు యువత, ఆధార్ పొంది పదేళ్లు దాటిన వారు బయోమెట్రిక్ వివరాలు అప్‌డేట్ చేసుకోవాలన్నారు. దీనివల్ల బ్యాంకు రుణాలు, సంక్షేమ పథకాలు పొందడంలో ఆధార్ ఇబ్బందులు ఉండవన్నారు.

మున్సిపల్ కార్మికుల వినూత్న నిరసన



వర్షంలో గొడుగులతో నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

నర్సీపట్నం: పని భారం తగ్గించి.. పెరిగిన జనాభా తగ్గట్టుగా పారిశుధ్య కార్మికులను నియమించాలని డిమాండ్ చేస్తూ.. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు వర్షంలోనే గొడుగులతో వినూత్న నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు మాట్లాడుతూ మున్సిపాలిటీ జనాభాకు తగ్గట్టుగా పారిశుధ్య కార్మికులు లేరన్నారు. పని చేయకపోతే అధికారులు బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. గతంలో ట్రాక్టర్‌కు నలుగురు కార్మికులు ఉండగా, ప్రస్తుతం ఇద్దర్ని పంపడం దారుణమన్నారు. మరోపక్క డ్రైవర్ డ్యూటీలు వేస్తున్నారన్నారు. సరిపడా పనిముట్లు లేవన్నారు. పుష్‌కాట్లు, ట్రాక్టర్లు మరమ్మతులకు గురయ్యాయన్నారు. క్యాజువల్ లీవులు సక్రమంగా ఇవ్వడం లేదని, వర్షాకాలంలో రెయిన్ కోట్లు, సబ్బులు, నూనెలు, గ్లౌజులు, బూట్లు పంపిణీ చేయలేదన్నారు. ఈ సమస్యలు పరిష్కారం కోసం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు బి.శ్రీను, రమణ, లోవరాజు, బాబూరావు పాల్గొన్నారు.

తుపాను ప్రభావం తగ్గేంతవరకు అప్రమత్తం

- తహసీల్దార్ రమేష్‌కుమార్, ఎంపీడీవో రాంబాబు



సిబ్బందికి వివరిస్తున్న తహసీల్దార్ రమేష్‌కుమార్, ఎంపీడీవో రాంబాబు

నాతవరం: కలెక్టరు ఆదేశాల ప్రకారం తుపాను ప్రభావం తగ్గేంతవరకు సచివాలయ ఉద్యోగులు, వీఆర్వోలు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ ఎస్.రమేష్‌కుమార్, ఎంపీడీవో జాగరపు రాంబాబు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దారు, ఎంపీడీవో మాట్లాడుతూ వర్షాలు అధికమైతే తాండవ నది లోతట్టు ప్రాంత ప్రజలను సురక్ష ప్రాంతాలకు తరలించే బాధ్యత మనదేన్నారు. గ్రామాల్లో తాగునీరు సమస్య లేకుండా ముందు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. విద్యుత్ అంతరాయం కలిగితే తాగునీటికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి రోగాలు రాకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. ప్రమాదకర పూరిళ్లు, శిథిలమైన భవనాలను గుర్తించి, అందులో ఎవ్వరూ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో అప్పలరాజు

తాండవ రిజర్వాయరు నీటి మట్టం ప్రమాదస్థాయికి నదీ ఒడ్డున గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు.

అంటు వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు

దేవరాపల్లి: తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండి వర్షాలు తగ్గుముఖం పట్టేవరకు సచివాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఇన్‌చార్జి ఎంపీడీవో ఎస్.అప్పలరాజు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ జి. సంతోషి నళిని, హౌసింగ్ ఏఈ భవ్యతేజతో కలిసి శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డ్రైనేజీల్లో నీటి నిల్వలు లేకుండా ఎప్పటికప్పుడు పూడిక తొలగించడంతో పాటు తరుచూ బ్లీచింగ్, క్లోరినేషన్ చేయాలని ఎంపీడీవో ఆదేశించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది సైతం క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. అనంతరం హౌసింగ్ సంబంధించిన అంశాలపై సమీక్ష నిర్వహించారు.

ఆకుకూరలతో కంటి ఆరోగ్యం భద్రం



కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించిన జిల్లా పదో అదనపు న్యాయమూర్తి శ్రీవిద్య

అనకాపల్లి: నిర్ణీత వయసు దాటిన వారు ఏటా కంటి పరీక్షలు చేయించుకుని, వైద్యుల సూచన మేరకు కంటి అద్దాలను వాడాలని జిల్లా పదో అదనపు న్యాయమూర్తి ఎస్.శ్రీవిద్య తెలిపారు. స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయమూర్తులకు, న్యాయవాదులకు వేద నేత్రాలయ సూపర్ స్పెషాలిటీ ఐకేర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. నిత్యం ఆకుకూరలు, కూరగాయలు తీసుకోవడం వలన కంటి సమస్యల నుంచి విముక్తి కలుగుతుందన్నారు. న్యాయమూర్తులు ఎ.రమేష్, విజయలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంజేవీఎస్ కుమార్, కార్యదర్శి దుర్గారావు, ఉపాధ్యక్షులు రోజా, సహాయకార్యదర్శి తులసి పాల్గొన్నారు.